

మహిళలంటే బీజేపీకి చిన్నచూపు
కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి మహిళలంటే చిన్నచూపని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. 10లో



కొనుగోళ్లు వేగవంతం చేయాలి
ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు సూచించారు. 10లో

గరిష్టం / కనిష్టం
45° / 25°

వాతావరణం
జిల్లాలో ఆదివారం అధిక ఉష్ణోగ్రత నమోద వుతుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వం.. శ్రీ వేంకటేశ్వర కల్యాణం



స్వామి వారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని శనివారం నేత్ర పర్వంగా జరిపించారు. ఆలయంలో శ్రీస్వామి వారికి ఉదయం పంచామృతాభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు స్వామివారి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు స్వామి వారి కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

సమ్మర్ క్యాంపులు సక్సెస్
కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం ప్రగతిమైదానంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవడం హర్షణీయమని కలెక్టర్ అనుదీప్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. చదువుతో పాటు క్రీడల్లో నైపుణ్యాన్ని సాధించాలనే ఉద్దేశంతోనే ఈ సెలవుల్లో క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. హాజరయ్యే విద్యార్థులకు ఆసక్తి గల క్రీడల్లో నైపుణ్యాలను నేర్పించేందుకు అనుభవజ్ఞులైన వ్యాయామ ఉపాధ్యాయుల సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి 8 గంటకు వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు విద్యార్థులు ఆయా క్రీడాంశాల్లో సాధన చేస్తున్నారని వివరించారు.

రేపు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు
కొత్తగూడెంటౌన్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15న అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దమ్మపేటలోని గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల ఆవరణలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు సీనియర్ అథ్లెటిక్స్ సెలక్షన్ ట్రయల్స్ ఉంటాయని పేర్కొన్నారు. పురుషులు, మహిళలకు 100, 200, 800, 1500 మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్, లాంగ్ జంప్‌ల్లో పోటీలు జరుగుతాయని, ప్రతిభ కనబర్చిన వారిని ఈనెల 25, 26 తేదీల్లో ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని వివరించారు. ఆసక్తి గల క్రీడాకారులు అథ్లెటిక్స్ కోచ్ కృష్ణ (7013552707)ను సంప్రదించాలని కోరారు.

అయోధ్య నుంచి శ్రీలంకకు పాదయాత్ర



రోహిత్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

పాల్వంచరూరల్: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని రాజాజీపురం గ్రామానికి చెందిన రోహిత్ కుమార్ రామాయణం ప్రేరణతో అయోధ్య నుంచి శ్రీలంకకు పాదయాత్ర చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం పాల్వంచకు చేరుకున్నాడు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు, శ్యామ్‌బాబు, ప్రశాంత్ తదితరులు రోహిత్‌కు ఘన స్వాగతం పలికారు.

పాలిచ్చి... పాలించి!

- ఆమె ఉద్యోగం చేయగలదు..
- కుటుంబ బాధ్యతలనూ సమర్థంగా నిర్వర్తించగలదు..
- లేవలేని కుమారుడికి ఎన్నేళ్లు వచ్చినా చిన్నపిల్లాడిలాగే సేవ చేయగలదు..
- పురుషులకు దీటుగా వ్యాపారంలో రాణించగలదు..
- రాజకీయాల్లోనూ సత్తా చాటగలదు...
- భర్త, కుటుంబం దూరమైనా పిల్లలను తీర్చిదిద్దగలదు..

ఇలా చెప్పుకుంటూ పోతే మహిళల జీవితంలో భిన్న పార్శ్వాలు, అద్భుత విజయాలు కనిపిస్తాయి. ఆమె లేనిదే ఒక నిమిషం గడపలేని కుటుంబాలెన్నో ఉన్నాయి. విద్య, వ్యాపార, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రాణిస్తూనే కుటుంబ బాధ్యతలనూ అదే స్థాయిలో విజయవంతంగా నిర్వర్తించే మహిళలు మన కళ్ల ముందే ఉన్నారు. బహు పాత్రలను ఏకకాలంలో సమర్థంగా పోషించగలిగే సత్తా మహిళలకే ఉంటుందని ఎవరైనా అంగీకరించక తప్పదు. నేడు అంతర్జాతీయ తల్లుల దినోత్సవం(ఇంటర్నేషనల్ మదర్స్ డే) సందర్భంగా భిన్నరంగాల్లో రాణిస్తూ, కుటుంబాలను తీర్చిదిద్దుతున్న మహిళామణులపై ప్రత్యేక కథనాలు.

...మరిన్ని కథనాలు 10లో

- పిల్లల పోషణ, ఉద్యోగ బాధ్యతల్లో మహిళల రాణింపు
- వృత్తి'ధర్మం'లో తేడా రాకుండా విజయకేతనం

నేడు అంతర్జాతీయ తల్లుల దినోత్సవం

మాతృ దినోత్సవం



పిల్లలకు భోజనం తినిపిస్తున్న సీఐ అంజలి



విధినిర్వహణలో సీఐ అంజలి (ఫైల్)

సవాళ్లను ఎదుర్కొంటూ...
– ఖమ్మం ట్రాఫిక్ సీఐ అంజలి

ఖమ్మంక్రైం: ఆమెది సవాళ్లతో కూడిన పోలీస్ ఉద్యోగం. రాత్రీపగలు తేడా లేకుండా ఒత్తిళ్లతో కూడిన విధులు నిర్వర్తిస్తూనే చిన్నారులైన ఇద్దరు పిల్లలను తీర్చిదిద్దుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు ఖమ్మం ట్రాఫిక్ సీఐ అంజలి. ఆమె భర్త కల్యాణ్ కూడా పోలీసు శాఖ ఉద్యోగి కావడంతో విధుల్లో బిజీగానే ఉంటారు. దీంతో సీఐ అంజలి ఓపక్క విధులు నిర్వర్తిస్తూనే పదేళ్ల కుమారుడు చాణక్య, ఆరేళ్ల కుమార్తె చిన్మయికి తల్లి ప్రేమ దూరం కాకుండా వ్యవహరిస్తున్నారు. పిల్లల ఆలనాపాలనా చూస్తూ ఇటు సీఐగా విధినిర్వహణలో రాణిస్తున్నారు. పిల్లల బాధ్యత ఎవరిపై వదిలివేయకుండా స్కూల్‌కు రెడీ చేశాకే తాను విధులకు వెళ్తానని, ఏ కాస్త ఖాళీ దొరికినా ఇద్దరు పిల్లలతో గడపడమే సంతోషాన్ని ఇస్తుందని అంజలి వెల్లడించారు.

కుమార్తెకు జడ వేస్తున్న భానుమతి



కుటుంబం కోసం కష్టాలూ ఇష్టంగా మారాయి..
– భద్రాద్రి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి

కొత్తగూడెంటౌన్: ఇంట్లో తల్లిగా, భార్యగా.. కోర్టుకు వెళ్తే కష్టాల్లో ఉన్న వారికి న్యాయం చేసే న్యాయమూర్తిగా మారిపోతానని చెబుతున్నారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి. అటు కుటుంబం, ఇటు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్న విషయమై భానుమతి వెల్లడించిన వివరాలు ఆమె మాటల్లోనే... కోర్టు పనుల్లో ఎంత ఒత్తిడి ఉన్నా ఆ ప్రభావం పిల్లలపై పడకుండా తల్లిగా వారికి ప్రేమ పంచుతూ, బాధ్యతలపై అవగాహన కల్పిస్తున్నా. తల్లిగా పిల్లల భవిష్యత్ తీర్చిదిద్దడం, భార్యగా భర్తకు అండగా నిలవడమే కాక న్యాయమూర్తి విధులకు సమన్యాయం చేయడం కష్టమే అయినా ఇష్టంగా చేస్తున్నా. జర్నలిస్టు కొత్తపల్లి శేషుతో నాకు వివాహమైంది. మా అబ్బాయి కొత్తపల్లి సుపీత్ర ఎనిమిదో తరగతి, కుమార్తె హరిచందన ఆరో తరగతి చదువుతున్నారు. తెల్లవారుజామున 4 గంటలకు నిద్రలేవడంతో దినచర్య ప్రారంభిస్తాను. పిల్లలకు స్వయంగా వంట చేసి పాఠశాలకు పంపిస్తాను. అమ్మాయికి జడ వేయడం మొదలు అన్ని పనులూ నేనే చూసుకుంటా. ఉదయం తొమ్మిది గంటలకు కోర్టుకు వెళ్లి సాయంత్రం పిల్లలను ఇంటికి తీసుకొచ్చాక గృహిణిగా మారిపోతాను. నా భర్త అండదండలతో అటు విధులు, ఇటు కుటుంబ బాధ్యతలను నిర్వర్తించగలుగుతున్నాను.



విధుల్లో భానుమతి

మాటలతో మంటలు

కాక పుట్టిస్తున్న రేగా కాంతారావు
- పాదెంతో పేచీతో ఒక్కటైన హస్తంలోని గ్రూపులు
- రేగా నామినేటెడ్ కామెంట్లపై గతంలో కామ్రేడ్ల కన్నెర్ర
- విప్ వ్యాఖ్యలతో ఇబ్బంది అంటున్న 'గూడెం' నేతలు



దుమ్ముగూడెంలో వాగ్వాదానికి దిగిన రేగా కాంతారావు - పొదెం వీరయ్య(ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భారత రాష్ట్ర సమితి జిల్లా అధ్యక్షుడు, పినపాక ఎమ్మెల్యే, విప్ రేగా కాంతారావు జిల్లా రాజకీయాల్లో కాక రేపుతున్నారు. సాధారణంగా మృదు స్వభావిగా కనిపించే రేగా.. వివాదాలకు దూరంగా ఉంటారు. అయితే సందర్భం ఎదురైతే మాత్రం ఆకాశమే హద్దుగా చెలరేగిపోతుంటారు. ఈ క్రమంలో ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యలు జిల్లాలో రాజకీయంగా చర్చకు దారి తీశాయి.

సంచలన వ్యాఖ్యలు

జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చందా లింగయ్యదొరకు అనుచరుడిగా రేగా కాంతారావు రాజకీయాల్లోకి వచ్చారు. ఆ తర్వాత ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం చేస్తూనే డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు నచ్చి ఉద్యోగానికి రాజీనామా చేసి పూర్తిస్థాయి రాజకీయ నేతగా మారారు. పినపాక అసెంబ్లీ స్థానం నుంచి మూడు సార్లు పోటీ చేసి రెండుసార్లు గెలుపు సొంతం చేసుకున్నారు. మాటలు తక్కువ.. పని ఎక్కువ అన్నట్టుగా ఆయన వ్యవహార శైలి ఉంటుంది. తనపై వచ్చే విమర్శలను కూడా పెద్దగా పట్టించుకోరనే పేరుంది. రాజకీయ ప్రత్యర్థుల విషయంలో ఆరోపణలు, సవాళ్లు చేసేప్పుడు సైతం నేరుగా కంటే సోషల్ మీడియానే ఎక్కువగా ఎంచుకుంటారు. అయితే బహిరంగ సభల్లో రేగా ప్రసంగాలు అప్పుడప్పుడు వివాదాలకు కేంద్రంగా మారుతున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రెండుసార్లు ఈ తరహా పరిస్థితి ఎదుర్కొన్నారు.

కాంగ్రెస్‌తో కయ్యం

ఇటీవల దుమ్ముగూడెంలో జరిగిన తునికాకు బోనస్ చెక్కుల పంపిణీలో భద్రాచలం ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్యకు రేగా కాంతారావుకు మధ్య వాడీవేడిగా వాదోపవాదాలు జరిగాయి. కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకుని రేగా పదునైన విమర్శలు చేశారు. అయితే రేగా చేసిన వ్యాఖ్యలు పరోక్షంగా పొదెం వీరయ్యకు లాభించాయి. జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్‌లో అనేక గ్రూపులు కొనసాగుతున్నాయి. నియోజకవర్గాల్లోనూ ఎవరికి వారే ఎన్నికల కార్యాలయాలు ఏర్పాటు చేసుకుని పని చేస్తున్నారు. ఈ క్రమంలో డీసీసీ అధ్యక్షుడిని టార్గెట్ చేస్తూ రేగా ఘాటుగా విమర్శలు చేయడాన్ని కాంగ్రెస్ శ్రేణులు సవాల్‌గా తీసుకున్నాయి. గ్రూపులకు అతీతంగా పొదెం వీరయ్యకు మద్దతుగా కాంగ్రెస్ నేతలు గళం విప్పుతున్నారు. పొదెం వీరయ్య సొంత నియోజకవర్గం భద్రాచలంలో హస్తం పార్టీలో మొదలైన ఈ ఐక్యతా రాగం క్రమంగా మిగిలిన నియోజకవర్గాలకూ పాకుతోంది. రేగా కామెంట్లు ఎన్నికల ఏడాదిలో ప్రధాన ప్రతిపక్షం ఒక్కతాటిపైకి వచ్చేందుకు ఉపయోగపడుతున్నాయనే అభిప్రాయం కాంగ్రెస్ నేతల్లో వ్యక్తమవుతోంది.

కమ్యూనిస్టులతోనూ పేచీ..

ఈ ఏడాది జనవరి చివరి వారంలో మణుగూరులో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రేగా.. గులాబీ కేడర్‌లో జోష్ నింపే క్రమంలో 'రాబోయే ఎన్నికల్లో మనదే గెలుపు. కమ్యూనిస్టులు మన ప్రత్యర్థులు కారు. వారు మన మిత్రులే, మన సమావేశాలకు ఆ పార్టీ వాళ్లను కూడా పిలవండి. పై స్థాయిలో అన్నీ మాట్లాడుకున్నారు. కమ్యూనిస్టులకు ఎమ్మెల్సీలు, నామినేటెడ్ పోస్టులు ఇస్తే సరిపోతుంది' అనే అర్థం వచ్చేట్టుగా మాట్లాడారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడి హోదాలో రేగా చేసిన వ్యాఖ్యలకు కమ్యూనిస్టు పార్టీలు తీవ్రంగా స్పందించాయి. సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా మొదలు రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు వరకు రేగా వ్యాఖ్యలకు కౌంటర్ ఇవ్వడం మొదలెట్టారు.

ఇరకాటంలో గూడెం నేతలు..

ప్రజాబలం ఉన్న తాము ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండేది లేదని 'ఎర్ర పార్టీ' నేతలు ఖరాకండీగా చెబుతున్నారు. ముఖ్యంగా కొత్తగూడెం స్థానాన్ని సీపీఐ గట్టిగా పట్టుబడుతోంది. అవకాశం వచ్చిన ప్రతీ సందర్భంలో కొత్తగూడెం నుంచి తాను కచ్చితంగా పోటీలో ఉంటానని కూనంనేని చెబుతూ వస్తున్నారు. పొత్తుల సంగతి ఎలా ఉన్నా ఇక్కడ బరిలో ఉండాల్సిందే అన్నట్టుగా ఆ పార్టీ అగ్ర నేతలు ఉన్నారు. జిల్లాలో ఏకైక జనరల్ స్థానంగా ఉన్న కొత్తగూడెం నుంచి కారు గుర్తుపై పోటీ చేసేందుకు సిట్టింగ్ ఎమ్మెల్యే వనమా రెడీగా ఉన్నారు. మరికొందరు సైతం గులాబీ కండువా కప్పుకుని పోటీకి సిద్ధం అవుతున్నారు. వీరందరిలోనూ రేగా చేసిన వ్యాఖ్యలు తమ కొంప ముంచేలా ఉన్నాయనే భావన వ్యక్తమవుతోంది.

విధుల్లోకి జేపీఎస్‌లు

సమ్మె విరమించిన పంచాయతీ కార్యదర్శులు



సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు (ఫైల్)

చుంచుపల్లి: తమ ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని కోరుతూ 16 రోజులుగా సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు శనివారం రాత్రి సమ్మె విరమించారు. నాలుగేళ్ల ప్రొబేషనరీ పీరియడ్ పూర్తయిన నేపథ్యాన సర్వీస్ క్రమబద్ధీకరించడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో జేపీఎస్‌లు సమ్మె బాట పట్టిన విషయం విదితమే. జిల్లాలో మొత్తం 481 గ్రామ పంచాయతీలు ఉండగా 353 మంది జేపీఎస్‌లు, 24 మంది ఓపీఎస్‌లు విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా తమను రెగ్యులర్ చేయాలనే ప్రధాన డిమాండ్‌తో సమ్మెకు దిగారు. అయితే, కొద్దిరోజులుగా విధుల్లో చేరాలని సూచిస్తున్న ప్రభుత్వం విధుల్లో చేరకపోతే సర్వీస్ నుంచి తొలగిస్తామని హెచ్చరించింది.

ప్రొబేషనరీ కాలం ముగియడంతో...

జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా చేరిన సమయాన ప్రొబేషనరీ కాలాన్ని మూడేళ్లుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఆ తర్వాత మరో ఏడాది పొడిగించి వేతనాన్ని దాదాపు రెట్టింపు చేసింది. అయితే నాలుగేళ్ల ప్రొబేషనరీ కాలం గత నెల 11వ తేదీతో ముగిసింది. దీంతో సర్వీస్ క్రమబద్ధీకరించకపోతే సమ్మె చేస్తామని జేపీఎస్‌లు నోటీసు ఇచ్చారు. అయినా ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట దీక్షలు నిర్వహిస్తూ సమ్మెకు దిగారు. ఈ క్రమంలో ప్రభుత్వం 9లోగా విధుల్లో చేరకపోతే టర్మినేట్ చేస్తామని హెచ్చరించినా స్పందన రాలేదు. అయితే ఎట్టకేలకు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పంచాయతీ కార్యదర్శులతో పలుమార్లు చర్చించారు. ఆయన సానుకూలంగా హామీ ఇవ్వడంతో సమ్మె విరమిస్తున్నట్లు జేపీఎస్‌ల సంఘం నేతలు శనివారం రాత్రి ప్రకటించారు. దీంతో జిల్లాలోని 353 మంది జేపీఎస్‌లు, 24 మంది ఓపీఎస్‌లు సోమవారం నుంచి విధుల్లో చేరుతున్నట్లు ప్రకటించారు. ఇదిలా ఉండగా జేపీఎస్‌లు సమ్మె చేస్తుండగానే మార్చి నెల వేతనాన్ని ప్రభుత్వం శుక్రవారం వారి ఖాతాల్లో జమ చేసింది.

వైద్య శిబిరం అభినందనీయం

- జిల్లా మాతా శిశు సంరక్షణ ప్రోగ్రామ్ అధికారి చైతన్య
- మారుమూల ఆదివాసీ గ్రామంలో మెడికల్ క్యాంప్



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ చైతన్య

చర్ల: మండలంలోని సత్యనారాయణపురం ప్రభుత్వ వైద్యశాల పరిధిలో గల రామచంద్రాపురంలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని జిల్లా మాతా, శిశు సంరక్షణ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ చైతన్య సందర్శించి, వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మారుమూల ఆదివాసీ గ్రామాల్లో ఇలాంటి శిబిరాలు నిర్వహించడం, గిరిజనులకు మెరుగైన సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. ఈ క్యాంప్‌ల వల్ల ప్రభుత్వ వైద్యం ప్రజలకు మరింత చేరువవుతుందని చెప్పారు. సత్యనారాయణపురం వైద్యాధికారి డాక్టర్ దివ్యనయన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో డాక్టర్ మౌనిక, హెల్త్ సూపర్‌వైజర్ కనకదుర్గ, ఎంఎల్‌హెచ్‌పీ వరలక్ష్మి, దీప్తి, పార్వతి, ఏఎన్ఎం రాజేశ్వరి, హెల్త్ అసిస్టెంట్లు వరప్రసాద్ వేణు, సుబ్బారావు, ఆశా కార్యకర్త కనకమ్మ పాల్గొన్నారు.

రామయ్యకు వైభవంగా
సువర్ణ తులసీ అర్చన

ఆలయంలో నేడు హనుమాన్ జయంతి వేడుకలు



స్వామివారికి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న ప్రధాన అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ వేడుకను కనుల పండువగా నిర్వహించారు.

నేడు హనుమజ్జయంతి..

శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలు జరగనున్నాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో హనుమాన్ దీక్ష చేపట్టిన మాలధారులు ఇప్పటికే భద్రాచలం చేరుకున్నారు. పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన మాలధారులు స్వామి వారిని దర్శించుకున్న అనంతరం దీక్ష విరమణ చేస్తున్నారు. ఇరుముడి, మొక్కులు సమర్పించుకుంటారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. హనుమజ్జయంతి సందర్భంగా నేడు ప్రత్యేక పూజలు చేయనున్నట్లు అర్చకులు తెలిపారు. కాగా, భక్తులు భారీగా తరలిరావడంతో రామాలయంలో లడ్డూల కొరత ఏర్పడినట్లు తెలిసింది.

కాంగ్రెస్‌లో జోష్ !

- కర్ణాటక విజయంతో పార్టీ కేడర్‌లో నూతనోత్సాహం
- జిల్లాలో నాయకుల సంబురాలు
- ఉమ్మడి జిల్లాలో రాజకీయ పరిణామాలపై చర్చ



టేకులపల్లిలో ప్రదర్శన నిర్వహిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: కర్ణాటక విధాన సభ ఎన్నికల ఫలితాలు జిల్లా కాంగ్రెస్ పార్టీలో ఉత్సాహాన్ని తెచ్చాయి. అక్కడ కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించడంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పార్టీ కేడర్, నేతల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. పార్టీకి ఈ ఫలితాలు పునరుత్తేజం కలిగించేవిగా ఉన్నాయని నేతలు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యాన జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కేడర్ సంబురాల్లో మునిగింది. తెలంగాణలోనూ ఇవే ఫలితాలు పునరావృతమవుతాయని.. గత రెండు ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో మెజార్టీ స్థానాలు సాధించిన నేపథ్యాన వచ్చే ఎన్నికల్లో మరింత మెరుగైన ఫలితాలను వస్తాయనే ధీమా ఆ పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది. ఏదిఏమైనా కర్ణాటక ఎన్నికల ఫలితాలు.. రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రాజకీయ చర్చకు దారితీశాయి.

ఉమ్మడి జిల్లా నుంచే మెజార్టీ స్థానాలు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. 2018 ఎన్నికల్లో మధిర, పాలేరు, కొత్తగూడెం, భద్రాచలం, పినపాక, ఇల్లెందు స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాలతో నలుగురు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. దీంతో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి జిల్లాలో ఇద్దరు ఎమ్మెల్యేలే మిగిలారు. ఈ క్రమంలో నియోజకవర్గాల వారీగా సరైన నాయకత్వం లేకపోవడంతో కేడర్ దిక్కుతోచని స్థితిలో ఉంది. నియోజకవర్గాల్లో స్థానికంగా ఉండే నేత లేకపోవడంతో పార్టీలో ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ఈనేపథ్యాన సంస్థాగతంగా బలం ఉన్నప్పటికీ సరైన నాయకత్వ లేమితో చుక్కాని లేని నావలా కాంగ్రెస్ పార్టీ మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జవసత్వాలు నింపేలా..

గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి అత్యధిక స్థానాలు గెలిచినా.. రాష్ట్రంలో అధికారంలోకి రాకపోవడంతో కేడర్‌లో నైరాశ్యం నెలకొంది. అధిష్టానం, టీపీసీసీ పిలుపునిచ్చే కార్యక్రమాలు నిర్వహించడం.. ప్రజల్లోకి వెళ్లడం, వారి సమస్యలపై పోరాటాలు చేయడం వంటివి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చేస్తున్నారు. ఈ సమయంలో కర్ణాటక విధాన సభకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం.. రాష్ట్రంతోపాటు జిల్లాలోనూ ఆ పార్టీకి కొత్త ఊపిరిలూదింది. కర్ణాటక ఫలితాలు తెలంగాణలోనూ పార్టీకి అనుకూల పవనాలు వీయడానికి తోడ్పడతాయని పార్టీ కేడర్ అభిప్రాయపడుతోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొనడానికి ఈ ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి ఆక్సీజన్‌లా ఉపయోగపడతాయనడంలో అతిశయోక్తి లేదనే ధీమా పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది.



భద్రాచలంలో కేక్ కట్ చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య

సంబరాల్లో కేడర్..

భద్రాచలంలో డీసీసీ అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే పొదెం వీరయ్య క్యాంప్ కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు కార్యకర్తలు భారీ ప్రదర్శన చేశారు. అక్కడ కేక్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరయ్య మాట్లాడుతూ.. కర్ణాటక నుంచే బీజేపీ పతనం ప్రారంభమైందని అన్నారు. బీజేపీ ప్రభుత్వం డబ్బు, అధికారంతో ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు కాంగ్రెస్‌కే పట్టం కట్టారని హర్షం వ్యక్తం చేశారు. ఇంకా కొత్తగూడెం, ఇల్లెందు, టేకులపల్లి, జూలూరుపాడు, పాల్వంచ తదితర ప్రాంతాల్లోనూ సంబరాలు మిన్నంటాయి.

క్లుప్తంగా

ప్రశాంతంగా ఎంసెట్



విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న సిబ్బంది

సుజాతనగర్: అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న ఎంసెట్ పరీక్షలు శనివారంతో నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఉదయం జరిగిన పరీక్షకు 125 మంది హాజరు కావాల్సి ఉండగా 120 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 125 మందికి గాను 123 మంది హాజరయ్యారు. రెండు సెషన్లలో కలిపి ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి



నిర్వాహకులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

అన్నపురెడ్డిపల్లి: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని గుంపెన గ్రామంలో ఉన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఇప్పటివరకు సేకరించిన ధాన్యం వివరాలను సొసైటీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని, మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. కొనుగోళ్లలో ఎదురవుతున్న సమస్యలను సొసైటీ చైర్మన్ బోయినపల్లి సుధాకర్ అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ సున్నం వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,205

అమ్మలందరికీ వందనం!

- అడ్డంకులను అధిగమిస్తూ విజయాలు
- అటు ఉద్యోగం, ఇటు రాజకీయాల్లో ముందడుగు
- కష్టాలెదురైనా చిరునవ్వుతో స్వీకరిస్తున్న తల్లులు



● అటు అమ్మ ప్రేమ.. ఇటు ప్రజాసేవ



తల్లి దర్జన్, కుమార్తె రుద్రభారతి ప్రియతో ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందు: ఏడు నెలలు నిండిన కుమార్తె రుద్రభారతీప్రియ, తల్లి బాదావత్ దర్జన్ ఇలా ఇప్పుడు నాకు ఇద్దరు తల్లులని ఆనందంగా చెబుతారు ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ. తన తల్లి దర్జన్ స్నేహితురాలిగా అన్ని విషయాల్లో తోడునీడగా ఉండి తీర్చిదిద్దిందని తెలిపారు. చదువుకునే సమయంలో ఇంటికి వచ్చేవరకు ఎదురుచూసే తల్లి.. తనకు వివాహమైనప్పటికీ ప్రతీరోజు మాట్లాడనిదే నిద్ర పోరని వెల్లడించారు. ఇప్పుడు నా కుమార్తెకు సపర్యలు చేస్తూ మాతోనే ఉంటుండడంతో ఆ ఆనందం రెట్టింపైందని తెలిపారు. ఎమ్మెల్యేగా పని ఒత్తిడిలో ఉన్నప్పటికీ.. మా అమ్మ స్ఫూర్తితో కుమార్తె విషయంలో ఏ లోటు రాకుండా చూసుకుంటున్నానని ఎమ్మెల్యే హరిప్రియ వెల్లడించారు.

● వ్యాపారవేత్తగా.. అమ్మగా...



కుమార్తె, కుమారుడితో ఉష

ఖమ్మంగాంధీచౌక్: వ్యాపారవేత్తగా, అమ్మగా ఆనందమయ జీవితాన్ని ఆస్వాదిస్తున్నారు ఉషా కలకోట. గృహిణిగా తల్లి రాజేశ్వరి నేర్పిన పాఠాలే తనను తీర్చిదిద్దాయని ఉష చెబుతారు. బీకాం చదివిన ఉష అమ్మ, భర్త, ఓ స్నేహితురాలి ప్రోత్సాహంతో 13ఏళ్ల క్రితం ఫ్యాబ్రిక్ డిజైనర్‌గా ప్రస్థానం ప్రారంభించారు. పత్తి వ్యాపారి భర్త సత్యంబాబు సహకారంతో తాను రాణిస్తూనే మరో ఆరుగురికి ఉపాధి కల్పిస్తున్నారు. ఉషా, సత్యంబాబు దంపతులకు కొడుకు సాయికేశవ్ పూణేలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా, కూతురు సాయి చిన్మయి వరంగల్ నిట్‌లో ఇంజనీరింగ్ చేస్తోంది. ఈసందర్భంగా ఉష మాట్లాడుతూ వ్యాపారంలోనే కాక పిల్లలను తీర్చిదిద్దడంలోనూ రాణించాననే తృప్తి ఎప్పటికీ ఉంటుందని తెలిపారు.

● గ్రామం.. కుటుంబాభివృద్ధే లక్ష్యం

ఇల్లెందురూరల్: గృహిణిగా తన ఆకాంక్షలకు అనుగుణంగా కుటుంబాన్ని తీర్చిదిద్దడమే కాక గ్రామ ప్రథమ పౌరాలిగా.. విప్లవోద్యమ బాటలో అలుపెరగని బాటసారిగా తన ప్రయాణం కొనసాగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు పోలారం గ్రామ పంచాయతీ సర్పంచ్ వాంకుడోత్ సరోజనమ్మ. ఆమెకు అక్షర జ్ఞానం లేకున్నా పిల్లలను చక్కగా చదివించాలన్న భావనతో భర్త కీముతో కలిసి శ్రమించింది. భర్త వడ్రంగి పనిలో రాణిస్తుండగా సరోజనమ్మ వ్యవసాయ కూలీగా పనిచేస్తూనే ఇద్దరు పిల్లలను చక్కగా చదివించారు. ఈక్రమంలో పెద్దకుమారుడు వెంకటేష్ ఉపాధ్యాయుడిగా, రెండో కుమారుడు రాంబాబు సింగరేణి ఉద్యోగిగా స్థిరపడ్డారు. అయినా నేటికీ ఉమ్మడి కుటుంబంగా ఉంటూ తల్లి సలహాలు పాటిస్తున్నారు. ఇక పోలారం సర్పంచ్‌గా రెండు సార్లు ఎన్నికైన ఆమె గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి దిశగా పరుగులు తీయిస్తున్నారు. సహజంగా మహిళ సర్పంచ్ అయితే ఆమె భర్త లేదా కుటుంబీకులు పెత్తనం చెలాయిస్తారు. కానీ సరోజనమ్మ మాత్రం గ్రామ పాలన, చిన్నచిన్న పంచాయతీల పరిష్కారంలో చొరవ తీసుకుని ముందుకు సాగుతున్నారు. ఇక ఏజెన్సీ గ్రామాల్లో పోడు భూముల ఉద్యమంలోనూ ఆమె క్రియాశీలక పాత్ర పోషించి జైలు జీవితం అనుభవించారు.



గ్రామంలో వివాదాన్ని పరిష్కరిస్తున్న సర్పంచ్ సరోజిని

● పిల్లల భవిష్యత్ కోసం కష్టమైనా ఇష్టమే...

కొత్తగూడెంటౌన్: ఇంట్లో ఉంటే తల్లిగా, భార్యగా.. కార్యాలయానికి వెళ్తే ఉద్యోగిగా అన్ని బాధ్యతలు విజయవంతంగా నిర్వర్తిస్తున్నారు సీడీపీఓ స్వర్ణలత లెనీనా. ఇద్దరు కుమార్తెల బాగోగులు చూస్తూ, వారి చదువుతో పాటు అన్ని విషయాల్లో జాగ్రత్తలు తీసుకుంటూ కార్యాలయానికి వెళ్లే తాను సాయంత్రం మళ్లీ సమయం పిల్లలకే కేటాయిస్తానని తెలిపారు. ఖమ్మం ముస్తఫానగర్‌కు చెందిన స్వర్ణలత లెనీనా ఎంఏ, బీఈడీ పూర్తి చేశాక ఐసీడీఎస్‌లో ఉద్యోగం వచ్చింది. వరంగల్‌లో విధులు నిర్వర్తించాక అంచెలంచెలుగా ఎదుగుతూ సీడీపీఓ స్థాయికి చేరారు. కొత్తగూడెంలోని సింగరేణి పాఠశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తించే ప్రభాకర్‌రావుతో స్వర్ణలత ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పనిచేస్తున్నారు. ఆమె పిల్లలిద్దరికీ ఏ లోటు తెలియకుండా పెంచుతూనే విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. పిల్లలను కూడా తీసుకుని విధులకు హాజరైన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం పెద్ద కుమార్తె మౌనిక ఇంజనీర్‌గా, చిన్న కుమార్తె హారిక డాక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అటు ఉద్యోగం రాణించడానికి, పిల్లలను ఉన్నత స్థాయికి తీర్చిదిద్దడం వెనుక భర్త ప్రోత్సాహం మరువలేనిదని స్వర్ణలత లెనీనా తెలిపారు.



భర్త ప్రభాకర్, కుమార్తెలతో స్వర్ణలత లెనీనా

● తల్లి కష్టంతో బిడ్డల భవిష్యత్...

పాల్వంచరూరల్: చేపలు, కిరోసిన్ అమ్మిన ఓ మహిళ ముగ్గురు కుమార్తెలను ఉన్నతస్థాయికి తీర్చిదిద్ది మన్ననలు అందుకుంటోంది. పాల్వంచకు చెందిన గిరిజన మహిళ చందావత్ సక్కుబాయి భర్త నాగేశ్వరరావు రెండేళ్ల క్రితం మృతి చెందాడు. మండల పరిధిలోని బస్వతారక కాలనీలో నిరుపేద కుటుంబానికి చెందిన సక్కుబాయి పాల్వంచ మార్కెట్‌లో చేపలు విక్రయిస్తూ రెక్కల కష్టంతో వారిని కూతుళ్లను ఉన్నత చదువులు చదివించింది. పెద్దకుమార్తె వినోద ఎంబీఏ పూర్తిచేసి హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీ నెలకొల్పి వ్యాపారవేత్తగా రాణిస్తోంది. రెండో కుమార్తె విమల ఎంటెక్ పూర్తిచేసి స్విట్జర్లాండ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా, మూడో కుమార్తె వినీల గుజరాత్‌లో బ్యాంక్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. ఈ సందర్భంగా సక్కుబాయి మాట్లాడుతూ కుమార్తెలు ప్రయోజకులు కావడం కంటే తనకేం కావాలని తల్లి ప్రేమను చాటారు.



ముగ్గురు కుమార్తెలతో సక్కుబాయి

మహిళలంటే బీజేపీకి చిన్నచూపు

- రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీని అరెస్ట్ చేయాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ఖమ్మంమయూరిసెంటర్: దేశం తరఫున పోటీల్లో పాల్గొని అనేక పతకాలు సాధించిన మహిళా రెజ్లర్లపై ఎంపీ, రెజ్లర్ల సంఘం అధ్యక్షుడు లైంగిక వేధింపులకు పాల్పడితే కేంద్రప్రభుత్వం కనీసం స్పందించడం లేదని.. మోదీ ప్రభుత్వానికి మహిళలంటే చిన్నచూపనే విషయం ఈ ఘటనతో తేలిపోయిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో శనివారం ఖమ్మంలో సుందరయ్య భవనం నుంచి సరితా క్లినిక్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించి ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ బీజేపీ కనీస ప్రజాస్వామ్యాన్ని పాటించడం లేదని ఆరోపించారు. ప్రతిపక్షాలపై బురద జల్లేందుకు ఇటీవల ఓ సినిమాకు అనుమతి ఇవ్వగా, ఈ సినిమా చూసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నాయకుడు బండి సంజయ్ కమ్యూనిస్టులు, ముస్లింలపై తన అక్కసు వెళ్లగక్కాడని తమ్మినేని తెలిపారు. కాగా, జేపీఎస్‌లు శనివారం మధ్యాహ్నం వరకు విధుల్లో చేరకుంటే ఉద్యోగాలు పోయినట్లేనని రాష్ట్రప్రభుత్వం చేసిన ప్రకటన సరికాదన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెకు దిగిన వారితో చర్చించాలని కోరుతూ తాను స్వయంగా సీఎం కేసీఆర్‌కు లేఖ రాసి అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నిస్తే ప్రభుత్వం ఖాతర్ చేయడం లేదని వీరభద్రం తెలిపారు.

కర్ణాటక ప్రజలది తెలివైన తీర్పు..

మోదీ ప్రభుత్వం చేస్తున్న ఆగడాలు గమనించి కర్ణాటక ప్రజలు తెలివైన తీర్పు ఇచ్చారని తమ్మినేని వెల్లడించారు. దేశవ్యాప్తంగా మోదీ పాలనపై మరిన్ని ఉద్యమాలు చేపట్టేందుకు సీపీఎం కార్యాచరణ రూపొందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, మాచర్ల భారతి, బండి పద్మ, కళ్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, బండి రమేష్, యర్రా శ్రీనివాసరావు, పి.రమ్య, బాగం అజిత పాల్గొన్నారు.

వైభవంగా ఆదర్శ వివాహం

కొత్తగూడెంటౌన్: శిల్ప, దివ్యాంగుడైన గుబ్బల సతీష్‌ల ఆదర్శ వివాహం శనివారం కొత్తగూడెం బాబుక్యాంప్‌లోని రామాలయం ప్రాంగణంలో అంగరంగ వైభవంగా జరిగింది. తెలంగాణ విభిన్న ప్రతిభావంతుల సంఘం (టీవీపీఎస్), జిల్లా దివ్యాంగ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఈ వేడుక నిర్వహించారు. నూతన జంటను బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్, కాంగ్రెస్ నాయకుడు ఎడవల్లి కృష్ణతోపాటు ఊకంటి గోపాలరావు, టీబీజీకేఎస్ నాయకుడు కూసన వీరభద్రం, మొరిశెట్టి భవానీ ప్రసాద్, మొక్కల వెంకన్న, మొక్కల రాజశేఖర్, టీవీపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుండవనేని సతీష్, మేడి ప్రవీణ్ తదితరులు ఆశీర్వదించారు.



నూతన జంటను ఆశీర్వదిస్తున్న పెద్దలు

అంజన్న భక్తుల సెల్‌ఫోన్లు చోరీ

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల పుణ్యక్షేత్రానికి దర్శనానికి వచ్చిన హనుమాన్ మాలధారులు 30 మందికి చెందిన సెల్‌ఫోన్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. శుక్రవారం రాత్రి కరీంనగర్, మంచిర్యాల జిల్లాల నుంచి హనుమాన్ మాలధారులు పర్ణశాలకు వచ్చారు. రాత్రి సమయంలో గోదావరి ఒడ్డున, కల్యాణ మండపం పరిసర ప్రాంతంలో నిద్రించారు. ఈ క్రమంలో అర్ధరాత్రి సమయంలో దొంగలు 30 మందికి చెందిన సెల్ ఫోన్‌లు, పర్సులను దొంగిలించారు. ఉదయం లేచిన తర్వాత గమనించిన మాలధారులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి చోరీ గురించి వివరించారు. వారి సూచన మేరకు మీ సేవ కేంద్రానికి వెళ్లి సీఈఐఆర్ యాప్ ద్వారా ఫిర్యాదు చేశారు.

మహిళ ఆత్మహత్య

భద్రాచలంటౌన్: వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. భద్రాచలం పట్టణ పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని ఓ కాలనీకి చెందిన వివాహిత(28)ను అశోక్ నగర్ కాలనీకి చెందిన నరేందర్ వేధింపులకు గురిచేశాడు. దీంతో మనస్తాపం చెందిన ఆమె ఈ నెల 7న విషపూరిత ద్రావణం తాగింది. గమనించిన కుటుంబీకులు భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఈ నెల 12న మృతి చెందింది. మృతురాలి కుటుంబీలకు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సమ్మెలో సొమ్మసిల్లిన వీఓఏ



సమ్మె శిబిరంలో సొమ్మసిల్లి పడిపోయిన వీఓఏ

మణుగూరురూరల్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ వీఓఏలు చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో శనివారం మణుగూరులోని శిబిరంలో ఓ వీఓఏ సొమ్మసిల్లి పడిపోయింది. తీవ్ర ఎండలో సైతం సమ్మె చేస్తుండడంతో ప్రభావం చూపింది.

రేషన్ బియ్యం పట్టివేత

అశ్వాపురం: మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ, పోలీసులు అధికారులు పట్టుకున్నారు. ఆటోలో అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో ఎస్ఐ జితేందర్, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిఘా పెట్టారు. 30క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకొని ఎంఎల్ఎస్ పాయింట్‌కు అప్పగించారు. నిందితుడు గోకినపల్లి కృష్ణపై 6ఏ కేసు నమోదు చేశామని, ఆటోను పోలీసులకు అప్పగించామని సివిల్ సప్లై డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు



ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న డీహెచ్ శ్రీనివాసరావు

జూలూరుపాడు: రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయపడ్డ సంఘటన మండలంలోని మాచినేనిపేటతండా గ్రామ పంచాయతీ పెద్దతండాలో శనివారం చోటుచేసుకుంది. పాపకొల్లు గ్రామానికి చెందిన బానోత్ వీరన్న, మాధవి దంపతులు పెద్దతండాలో ఓ వివాహ కార్యక్రమానికి బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో బైక్ పశువులకు ఢీకొనడంతో దంపతులు కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. కాగా అదే సమయంలో కొత్తగూడెం వెళ్తున్న రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ గడల శ్రీనివాసరావు క్షతగాత్రులను గమనించి, తన వాహనంలో కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కుమారస్వామికి ఫోన్‌లో సూచించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డ ఇద్దరు వ్యక్తులు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. మణుగూరు సీఐ ముత్యం రమేష్ కథనం ప్రకారం.. ఏడూళ్ల బయ్యారం గ్రామానికి చెందిన ఈదర ప్రకాశ్‌రెడ్డి(23) బైక్‌పై మణుగూరు నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా మణుగూరు మండలం తిర్లాపురం గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై బొలెరో వాహనం ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కాగా భద్రాచలం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మణుగూరులోని ఆదర్శనగర్‌కు చెందిన మల్లూరి బాలయ్య(65) రోడ్డు మీద నడుచుకుంటూ వెళ్తుండగా బెంగళూరు బేకరీ సమీపంలో ఓ ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి షాక్‌తో మృతి

ఖమ్మంఅర్బన్: విద్యుత్ తీగలతో చేపలు పట్టేందుకు వెళ్లిన ఖమ్మం యూపీహెచ్ కాలనీ రాజీవ్‌నగర్‌గుట్టకు చెందిన కోడిరెక్కల రవి(45) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఖానాపురం ప్రశాంతినగర్ సమీపాన సాగర్ కాల్వలో విద్యుత్ తీగల సాయంతో చేపలు పట్టేందుకు రవి, ఆయన స్నేహితుడు వెళ్లారు. ఈక్రమంలో రవి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వివాహిత ఆత్మహత్య

ఖమ్మంలోని రామన్నపేటకు చెందిన వివాహిత జి.లింగమ్మ(56) ఎలుకల మందు తిని ఆత్మహత్యకు పాల్పడింది. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె ఎవరూలేని సమయంలో ఎలుకల మందు తిని ఆత్మహత్యకు యత్నించింది. ఆమె కుమార్తె ఫోన్ చేస్తే తీయకపోవడంతో వచ్చి చూసేలోగా మృతి చెందింది.